పాలవలసలో 'పొలం బడి'

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలం పాలవలస గ్రామంలో మండల వ్యవసాయాధికారి నరసింహ మూర్తి ఆధ్వర్యంలో జీఏపీ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సస్యరక్షణ పద్ధతుల కోసం అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, నారుశుద్ధి, కొసలు తుంచి నాట్లు వేయడం, పంటల యాజమాన్యం గూర్చి వివరించారు. ఇందులో భాగంగా బీజామృతం డెమో చేసి రైతులకు చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చెల్లూరు.ధర్మారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రదీప్, ప్రకృతి వ్యవసాయ విభాగం మండల యాంకర్ కుమారి, ఐసీఆర్పీలు పుష్పలత, తిరుమల, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

సేవే ఈ శ్రీనివాసుడు ధర్మం

- ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు పేరుతో ఆపన్నులకు అభయహస్తం
- నేడు సుర శ్రీనివాసరావు పుట్టినరోజు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నేటి కాలంలో డబ్బు సంపాదన చాలా సులువు అయింది. సంపాదనపరుడు పెరుగుతున్నారు అందులో సేవా తత్పరులు కొందరే ఉంటారు. ఆ సేవా తత్పరుగుణం మెండుగా ఉన్న వ్యక్తి సుర శ్రీనివాసరావు. సాధారణంగా పేదవాడు పెద్దవాడయ్యాక కొందరిలో అహంకారం, స్వార్థం, ఆవేశం పెరుగుతాయి. కానీ యస్ యస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సూర శ్రీనివాసరావు మాత్రం విభిన్నం. ఆయనలో గర్వం లేదు, స్వార్థం లేదు, ఉన్నంతలో నలుగురికి పంచే మనసు మాత్రమే ఉంది. అన్నా కష్టం ఉందని కబురు పెడితే చాలు నేనున్నానంటూ అభయహస్తమిస్తూ ఎందరో అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపి సేవే తన ధర్మంగా సూర శ్రీనివాసరావు అడుగులు వేస్తున్నారు. ఆయన చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యానని గుర్తుంచుకొని చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదని పిల్లల చదువులు ఆగిపోకుండా ఆర్థిక సాయం చేయడం, పేదింటి ఆడపిల్ల వివాహానికి అండగా నిలవడం, అనారోగ్యంతో బాధపడే వారికి ఒకరేమిటి కష్టాల్లో ఉన్న వారందరినీ ఆదుకోవడమే తన పరమ విధిగా పనిచేసే నిత్య శ్రామికుడు ఈ శ్రీనివాసుడు. ప్రతి సంవత్సరం ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా బడి పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందించడం, పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం చేయూతనివ్వడం ఆయనకు ఆనవాయితీ. ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి సాయం చేయడం కూడా ఆయన సేవా జాబితాలో భాగమే. "సేవ చేస్తేనే మనిషి జీవితం సార్థకం" అనే ఆలోచనతో ఆయన అడుగు ముందుకు వేస్తారు. అందుకే సేవ పొందిన వారు ఆయనను కేవలం దాతగా కాకుండా "సేవా మూర్తి"గా భావిస్తున్నారు. ఆయన ఇచ్చే సహాయం డబ్బుతో పాటు ఆదరణ, ఆదర్శం కూడా కలిగిస్తుంది. ఆయన చేసిన సహాయాలు చెప్పుకుంటూ పోతే పెద్ద పుస్తకమే అవుతుంది. ఎన్ని సేవలు చేసిన కుడి చేతితో చేసిన సాయం ఎడమ చేతికి కూడా తెలియని విధంగా నిగర్వంగా ఆయన నడవడిక ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంది. సినిమాల్లో సాయం చేసే వారిని హీరోలుగా చూస్తున్నాం. సభ్య సమాజంలో నిజమైన హీరో సుర శ్రీనివాసరావు. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు, ఆయన సాయం తో ఎదిగిన పలువురు ఆయన పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. సేవా తత్వం గల వ్యక్తి మన శ్రీకాకుళంలో జన్మించి, తన కృషితో ప్రజల గుండెల్లో నిలిచిపోవడం గర్వకారణం అని పలువురు పేర్కొన్నారు. మరింత కాలం ఆరోగ్యంగా ఉండి, ఎంతోమందికి సేవ చేసే శక్తి కలగాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

ఊరిలో యూరియా తగ్గించి, నానో యూనియన్ వినియోగించండి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : వరి పంటలో యూరియా వాడకాన్ని తగ్గించి, నానో యూరియాను వినియోగించాలని రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం హెడ్ డాక్టర్ మధు కుమార్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్ అన్నారు. శుక్రవారం మండలం, ఎత్తురాళ్లపాడు గ్రామం లో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా, జిల్లా వనరుల కేంద్రం, శ్రీకాకుళం వారు ఖరీఫ్ 2025 సీజన్‌లో వరి పంటలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు గురించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలోని ఎరువుల యాజ మాన్యం, పురుగు, తెగులు యాజమాన్యం గురించి వివరముగా రైతులకు వివరించారు. రైతుల యొక్క సాగు సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారం తెలియజేశారు. ముఖ్యముగా వరిలో మోతాదుకి మించి యూరియా వాడొద్దని, నానో యూరియా వాడాలని, పోటాష్ ను రెండు సార్లు తప్పని సరిగా వెయ్యాలని సూచించారు. సుడి దోమ నివారణకు కాలి బాటలు అవశ్యకత గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులకు మరిన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యస్. గోవింద రావు, వి.ఏ.ఏ, రైతులు పాల్గొన్నారు.

మెగా స్టార్ జన్మదినోత్సవం సందర్భంగా నిత్యావసర వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో పేదలకి నిత్యావసర వస్తువులను పంపిణీ చేసారు. గత వారం రోజులుగా చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళంలో చిరంజీవి యువత వారోత్సవాలను నిర్వహిస్తుంది. రోజుకో రకమైన సేవా కార్యక్రమాలను చేపట్టింది. మొక్కలు నాటడం, రక్తదానం, అన్నదానం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో పాటు మెగా డ్యాన్స్ పోటీలను నిర్వహించింది. అందులో భాగంగానే పేదలకి నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రామన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీఎస్ వి జ్యూయలర్స్ యాజమాన్య ప్రతినిధి బోయిన పృధ్వీతో పాటు ఉత్తరాంధ్ర చిరంజీవి యువత కార్యదర్శి వైశ్యరాజు మోహన్‌తో పాటు శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంత, మెగాస్టార్ చిరంజీవి అభిమానులు, మెగా ఫ్యామిలీ హీరోల సంఘాల నాయకులు మజ్జి గౌతమ్, తైక్వాండో నవీన్, గొర్లె కిరణ్ కుమార్, జోగిపాటి వంశీ, శీర రాజు, పెయ్యల చంటి, కిరణ్ రెడ్డి, కెల్ల గిరి, పంకు మురళీ, మహేష్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎరువుల కొరతే లేదు : కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీపై పర్యవేక్షణ కోసం 9121863788 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని వివరించారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో వరి, ఇతర పంటలు కలిపి సుమారు 3,73,000 ఎకరాల్లో సాగు కొనసాగుతోందని చెప్పారు. దీనికి గాను 17 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేసినా, ఇప్పటివరకు రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాలు ద్వారా 10,244 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 11,400 మెట్రిక్ టన్నులు - మొత్తంగా 21 వేల మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేశామని తెలిపారు. అంటే అవసరానికి మించి సుమారు 4 వేల మెట్రిక్ టన్నులు అదనంగా అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాలు వద్ద 218.86 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 261 మెట్రిక్ టన్నులు, బఫర్‌లో 552 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 1,031.86 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. అదనంగా మరో 3,200 మెట్రిక్ టన్నులు వారం రోజుల్లో జిల్లాకు చేరుకుంటాయని కలెక్టర్ వెల్లడించారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎరువుల నిల్వపై రోజువారీగా పర్యవేక్షణ జరుగుతోందని, రెవెన్యూ, విజిలెన్స్ విభాగాల సహకారంతో తనిఖీలు కూడా చేపడుతున్నామని ఆయన తెలిపారు. రాబోయే రబీ సీజన్ కోసం రైతులు ముందస్తు సిద్ధం అవుతున్నప్పటికీ, ఏ సీజన్‌కు అవసరమైతే ఆ సీజన్‌కి సరిపడా ఎరువులు అందజేస్తామని భరోసా ఇచ్చారు. శాస్త్రవేత్తల సూచనలు పాటించి అవసరమైన మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. నానో ఎరువులు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని, అర లీటర్ ధర రూ.220 మాత్రమేనని, ఇది ఒక బస్తా యూరియాకు సమానమని, డ్రోన్ల ద్వారా పిచికారి చేయడం ద్వారా రైతులు మెరుగైన లాభాలు పొందవచ్చని వివరించారు. ఎవరైనా ఎరువులు అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిసినట్లయితే వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్ (9121863788)కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

వీధిల్లో విద్యుత్ కొత్త బల్బులు అమరిక : ఈఓ భాస్కర్‌రావు

విశాలాంధ్ర - హిరమండలం : శుక్రవారం హిరమండలం మేజర్ పంచాయతీ లోని గిరిజాల వీధి మెయిన్ రోడ్ అంగూరు వీధి మెయిన్ రోడ్ పాత పంచాయతీ వీధి మెయిన్ రోడ్ దిగువ వీధి మెయిన్ రోడ్డు కూరగాయలు మార్కెట్ తదితర వీధుల్లో విద్యుత్ స్తంబాలకు కొత్త బల్బులు అమర్చినట్లు పంచాయతీ ఈఓ మూల భాస్కర్ రావు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఈఓ భాస్కర్ రావు మాట్లాడు తూ పంచాయతీలోని ప్రజానీకం నకు సమస్యలు పరిష్కారంకై అహర్నిశలూ పంచాయతీ సిబ్బంది తో పాటు అందరం శ్రామిస్తున్నామని కొళాయి త్రాగునీరు ప్రజలకు అందకపోయినా, వీధి విద్యుత్ దీపాలు వెలగక పోయినా, పారిశుధ్యము ఎక్కడ తాండవించినా దృష్టికి వచ్చిన మరుక్షణం సమస్య ను పరిష్కారం చేస్తూ పంచాయతీ ప్రజలు మన్ననలు పొందుతు న్నానన్నారు. వీధి బల్బులను జోగి చంటి, లొట్టి అరుణ్ కుమార్ లుచే అమర్చుతున్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించడమే ధ్యేయం : ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : పలాస నియోజక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు.శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ ఫిర్యాదులను ఎమ్మెల్యే శిరీషకు ప్రత్యేకంగా వివరించడంతో పాటు వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాధర్బార్ లో ఎక్కువ శాతం దివ్యాంగుల పింఛన్లు రద్దు సమస్య రైతులకు ఎరువులు సమస్య వంటి ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, సంబంధిత జిల్లా మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రజాధర్బార్ కు 39 దరఖాస్తులు రాగా ఆయా శాఖల అధికారులతో సమస్యలపై ఆమె చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేశారు.

మట్టి గణపతిని పూజిద్దాం.. ప్రకృతిని రక్షిద్దాం

విశాలాంధ్ర - కవిటి : మట్టి గణపతిని పూజించి.. ప్రకృతిని కాపాడాలని కవిటి కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ వండి బిందు మాధవి, ఏవో రాణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల వద్ద మట్టి గణపతి విగ్రహాలు వలన ప్రకృతిని కాపడడం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వలన ప్రకృతి కలుషితం ఎలా అవుతుందో విద్యార్థులకు వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వలన నీరు కలుషితం అవుతుందని, వాటిలో జీవించే జీవులన్ని మృతి చెందడం జరుగుతుందని దీని వల్ల పర్యావరణ పరిరక్షణ పోతుందని తెలిపారు. అందరూ మట్టి గణపతిని పూజించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండల మల్లన్నకు హరిద్ర లేపనంతో అలంకరణ



విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని స్థానిక రావివలస గ్రామంలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారిని హరిద్ర లేపనం (పసుపు) తో అలంకరణ చేపట్టారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో స్వామివారి స్వయంభు లింగానికి మొత్తం పసుపు రాసి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేపట్టినట్లు ఆలయ ఈవో జి.గురునాధరావు తెలిపారు. ఈ ప్రత్యేక అలంకరణ చూడడానికి స్థానిక భక్తులు వచ్చి ఎండల మల్లన్న దర్శించుకున్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం బొరివంక విద్యుత్తు సబ్స్టేషన్ నందు 11కేవీ, ఆర్డీఎస్ఎస్ పనులు నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 3 గంటల వరకు సబ్స్టేషన్ పరిధిలోని బొరివంక ఎగువవీధి, బొగిడియా పుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, తుంగాన పుట్టుగ, కొర్రాయిపుట్టుగ గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్తు శాఖ ఈఈ జి. యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గృహవినియోగదారులు, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీచర్ల బదిలీ వీడ్కోలు సమావేశంలో తల్లిదండ్రులపై ఎంఈఓ ఆగ్రహం

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : బదిలీ వీడ్కోలు సమావేశంలో తల్లిదండ్రులకు ఎంఈఓకు వాగ్వాదం ఏమిటి అనుకుంటున్నారా! వివరాల్లోకి వెళితే మండలంలో ఇటీవల క్రిష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఇంతవరకూ పనిచేసి వేరే పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పిలిచి ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఒక సమావేశం ఏర్పాటు చేసి ఇన్ని సంవత్సరాల పాటు తమ పాఠశాల పట్ల పిల్లల పట్ల అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులను సత్కరించి గౌరవ అభిమానాలను చూపి కృతజ్ఞత చాటుకున్నారు. ఈ సమావేశానికి ఇద్దరు మండల విద్యాశాఖాధికారులు, సమీప పాఠశాల ఉపాధ్యా యులు కూడా కొందరు హాజరవడం జరిగింది. ఇంత వరకూ బాగానే ఉంది ఇప్పుడే అసలు సమస్య తెరమీదకు వచ్చింది. సమావేశానికి వచ్చిన అక్కడే ఉన్న కొంతమంది తల్లిదండ్రులు అదే గ్రామానికి చెందిన మండలంలో అధికార పార్టీలో క్రియాశీలకంగా ఉన్న ఒక నేత తమ పాఠశాలలో ఏడు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇచ్చారని ఏడు తరగతులకు 26 సబ్జెక్టులు ఇద్దరూ ఉపాధ్యాయులు చెప్పడం కష్టంగా ఉందని మండలంలో మిగులు ఉపాధ్యాయులను గాని మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుడిని గాని తమకు శాశ్వతంగా కేటాయించాలని ఎంఈఓను కోరగా ఆయన వారిపై ఎక్కడ ఏం? మాట్లాడాలో తెలియదా? ఏదైనా ఉంటే ఆఫీసుకు వచ్చి కలవండి అంటూ అధికార దర్పం ప్రదర్శించారని తల్లిదండ్రులపై చిర్రు బుర్రులాడారని సమాచారం.ఇదే సమావేశంలో అధికార పార్టీ నేత కూడా ఎంఈఓ వైఖరి చూసి కాస్త ఆశ్చర్య పోవడం తన వంతు అయిందని కొందరు అనుకుంటున్నట్లు సమాచారం. మండలంలో డెప్టేషన్ల విషయంలో నిబంధనలు పాటించకుండా తనకు నచ్చిన పాఠశాలలోనే డెప్టేషన్లు వేస్తున్నారని గతంలో కూడా ఒక ప్రాథమికోన్నత పాఠశాలలలో కూడా ఇటువంటి సమావేశానికే వెళ్లి అక్కడ పాఠశాలకు శాశ్వతంగా ఎంటీఎస్ ఉపాధ్యాయుడిని కేటాయిస్తానని చెప్పారని అసలు అలా డెప్యూటేషన్ వేయడం కుదురుతుందా నిబంధనల ప్రకారం కేటాయించాలి లేదంటే ఉన్నతాధి కారులకు తెలియజేస్తానని చెప్పాలి గాని తనకు తాను ఒక సుప్రీం మాదిరిగా తనకు నచ్చిన దగ్గర హామీలు నచ్చన దగ్గర చిందులు ఇది ఈయన వైఖరని మండలంలోని పలువురు ఉపాధ్యాయులు అనుకుంటున్నారని సమాచారం ఏది ఏమైనా చిన్న చిన్న సమస్యల పట్ల కూడా సానుకూల వైఖరి ఇతరుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా అంతా ఏకపక్ష వైఖరితో ఎంఈఓ ముందుకు వెళ్లడం కారణంగా ఈ పరిణామాలన్నీ తమ మండలంలోని విద్యార్థుల ప్రగతికి అవరోధాలుగా మారనున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

పారదర్శకంగా మన డబ్బులు..మన లెక్కలు

ఐటీడీఏ పీవో పైడి కూర్మా రావు

విశాలాంధ్ర - మందస : మహిళా స్వయం శక్తి సంఘాలు అన్నీ తమ పొదుపు ,అప్పు పుస్తకాలతో పూర్తి లెక్కలు అంతర్గత ఆడిట్ ను పూర్తి చేసుకుని ప్రభుత్వం ఆన్ లైన్ విధానంలో మన డబ్బులు..మన లెక్కలు అన్న వెబ్ సైట్ ద్వారా సంఘ సభ్యులందరికీ పారదర్శకంగా తమ సంఘం లెక్కలు తెలిసే విధంగా ఖచ్చితంగా పొందుపరచాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సిబ్బంది సమీక్ష మరియు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామ సంఘంలో అన్ని సంఘాలకు పూర్తి స్థాయిలో లెక్కలు వేయించి సభ్యులందరికీ వారి పొదుపు మరియు అప్పుల లెక్కలు పూర్తి స్థాయిలో తెలియవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆ బాధ్యతను సంఘం బుక్ కీపర్ మరియు గ్రామ సంఘం ప్రతినిధులు, వి.వో.ఏ.తో పాటు సంబంధిత క్లస్టర్ కోఆర్డినేటర్లు బాధ్యత వహించాలని సూచించారు. పంచ సూత్రాలు పాటిస్తున్న సంఘ సభ్యుల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను కొరకు మరియు ప్రతి మహిళ ఒక ఎంటర్ప్రైనర్ గా తయారు కావాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. శ్రీనిధి మరియు సిఐఎఫ్. రుణాలను బయోమెట్రిక్ విధానం ద్వారా యాక్టివిటీ చేసుకోబోతున్న మహిళలందరికీ ఇప్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ రాము, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, అకౌంటెంట్ కళ్యాణి, కృష్ణకుమారి, మండల సమాఖ్య ప్రతినిధి కాంతమ్మ, అందరు క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.ఓ.ఏ.లు పాల్గొన్నారు.

మహిళలతో కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు

ఉచిత ప్రయాణానికి అనూహ్య స్పందన

విశాలాంధ్ర - కొత్తూరు : ఏ.పి.ఎస్ ఆర్.టీ.సి బస్సుల్లో స్త్రీ శక్తి పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకార్యం తరువాత ఆర్.టీ. సి బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య అనూహ్య గా పెరిగింది ఒక బస్‌లో దాదాపు 60 శాతం మహిళలు ప్రయాణిస్తే మిగిలిన 40 శాతం స్త్రీలు ప్రయాణిస్తున్నారు. ఆటోలు ప్రయివేట్ బస్సు ఎక్కడానికి మహిళలు ఇష్టపడడం లేదు రోజు రోజుకి మహిళల ప్రయాణికుల సంఖ్య బాగా పెరుగుతుందని ఆర్.టీ.సి సిబ్బంది చెప్తున్నారు. ఎవరికి ప్రయోజనం ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం గ్రామాల్లో ఉంటూ మండల కేంద్రాల్లో గల ప్రయివేట్ షాపుల్లో పనిచేస్తూ బస్సులో ప్రయాణిస్తూ మహిళలకు బాగా ప్రయోజనం అదే విధంగా కొందరు మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం అని చెప్పాలి.

మూగ జీవాలను సంరక్షించాలి

విశాలాంధ్ర - కాశీబుగ్గ : పలాస - కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల మూగ జీవాలను ఆయా ప్రాంతాలలో ఉన్న రైతులు వాటిని సంరక్షించాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు. మూగ జీవాలను రక్షించుకో లేని రైతులు మునిసిపాలిటీ పరిధిలో ఏదో ఒక చోట వాటిని వదిలేస్తే మంచిదని అభిప్రాయ పడున్నారు. పాల వ్యాపారులు ఆవులను తెచ్చి బస్టాండ్ ప్రాంతాల్లో వదిలేయడం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, పాదచారులు చెబుతున్నారు. కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో వర్షం పడితే ఆవులు మూకుమ్మడిగా బస్టాండ్ లోకి వచ్చేస్తున్నాయని, అందులో ఉన్న ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పలాస ఆర్.టీ.సి డిపో వద్ద ఎంతో అవకాశం ఉన్నా ప్రయాణీకులు మాత్రం కాశీబుగ్గ బస్టాండ్ వద్దే అధికంగా ప్రయాణికులు కిక్కిరిసి పోతున్నారు. కాశీబుగ్గ సంత ప్రాంతంలో కూడా ఆటోలు, వాహనాలతో పాటు ద్విచక్రవాహనాలు, మరో వైపు చిన్న వ్యాపారులు, కాయ గూరలతో నిండిపోతున్నాయి. ఆయా సమయాలలో ఉన్నప్పుడు ఆవులను తప్పించే ప్రయత్నంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మూగ జీవాలపై అధికార్లు స్పందించి వాటిని దూరంగా పంపించే చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి : మున్సిపల్ కమిషనర్ రామరావు

విశాలాంధ్ర - పలాస : ఎన్.టి.ఆర్ హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలనీ మున్సిపల్ కమిషనర్ ఎం రామారావు అన్నారు. శుక్రవారం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంనకు సంబంధించి కోసంగిపురం వద్ద గల రామకృష్ణాపురం లే-అవుట్‌లో మన ఇల్లు మన గౌరవం ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ లో భాగంగా మంజూరైన 1966 లబ్ధిదారులకు గాను 600 మంది ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేశారని మిగిలిన వారు తొందరలో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రామారావు కోరారు. రామకృష్ణాపురం లేఔట్‌లో గల ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో కమిషనర్ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం పర్యటించి ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన పరిస్థితులను గూర్చి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మంజూరైన 1966 ఇండ్లకు గాను 600 ఇండ్లు మాత్రమే పూర్తికాబడినవి అని 860 ఇండ్లు స్లాబ్ లెవల్ వరకు వచ్చి ఆగి ఉన్నవని 506 మంది ఇంకా ఇండ్ల నిర్మాణం పూర్తిగా మొదలు పెట్టలేదని అన్నారు. ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిన అదనపు ఆర్థిక సహాయంతో ఇండ్ల నిర్మాణములు పూర్తి చేయాలని అదేవిధంగా స్టేజ్ అప్డేషనులను కూడా కొనసాగించాలని కోరారు. అదనపు ఆర్థిక సహాయం మంజూరైన వారు త్వరగా నిర్మాణము పూర్తి చేయనట్లయితే మంజూరైన అదనపు మొత్తము రికవరీ చేయబడుతుందని మరియు ఇండ్లు కూడా రద్దు చేస్తామని తెలియజేశారు. రామకృష్ణాపురం లేఔట్ లో ప్రభుత్వం ఇప్పటికే మౌలిక వసతులు కల్పించినదని,మౌలిక సదుపాయంలు అనగా విద్యుత్, త్రాగునీరు కల్పించి ఉన్నారని మరియు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నది కావున సదరు మంజూరైన ఇండ్ల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రభుత్వం వారు త్వరలో ప్రారంభించబోయే సామూహిక గృహప్రవేశాలకు అందరూ కూడా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కమిషనర్ కోరారు.

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని దేవాది గ్రామంలో శుక్రవారం నియోజకవర్గంలోని నరస న్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరి, కూరగాయలు పండించే రైతులకు ప్రకృతి వ్యవ సాయం మాస్టర్ ట్రైనీ, తోట రామారావు పసుపు పళ్ళాలు, లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి, కూరగాయలు పండించే రైతులు తమ పొలాల్లో లింగాకర్షక బుట్టలు, పసుపు పళ్ళాలు పెట్టడం వలన పచ్చ దోమ, తెల్ల దోమ, నివారణ జరగడమే కాకుండా కాండం తొలిచే పురుగు నివారిస్తోందన్నారు. ఇవి ఒక ఎకరానికి 15పసుపు పళ్ళాలు, 6లింగాకర్షక బుట్టలు పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, సీతారామయ్య, మేరి, లజపతిరావు, పాపారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ పురాతన మెట్ల బావిని పునర్నిర్మించండి

ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కోరిన ఇంటాక్

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : గార మండలం నిజామాబాద్ గ్రామంలో 1640 సంవత్సరంలో షేర్ మహమ్మద్ ఖాన్ నిర్మించిన అతిపెద్ద మెట్ల బావిని పర్యాటక కేంద్రం గా మల చాలని, ఇందుకు సహ కారాన్ని అందించ మని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ ను శుక్రవారం ఇంటాక్ శ్రీకాకుళం బృందం కోరింది. ఈ మేరకు ఆ బావి యొక్క చరిత్ర విశిష్టతలను తెలు పుతూ ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం నియోజకవర్గంలో ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయని వాటిని ప్రజా దర్శనార్థం చక్కగా రూపకల్పన చేయాల్సిన బాధ్యత అందరిదీ అని, తమ వంతుగా ఈ విషయంలో కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఇంటాక్ సభ్యులు తెలిపారు. ఆయన వెనువెంటనే స్పందిస్తూ ఈ ప్రాంతాన్ని సందర్శించి దీని పునరుద్ధరణకు తగు సూచనలతో నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలను ఇచ్చినట్లు వారు తెలిపారు. ఇంటాక్ ప్రతినిధి బృందంలో కన్వీనర్ నూక సన్యాసిరావు, కో కన్వీనర్ నటుకుల మోహన్, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు అదనపు కన్వీనర్, సీనియర్ సభ్యుడు కొమ్ము రమణమూర్తి సభ్యులు ఉన్నారు.

గణిత భోధిని పుస్తకాలును ఉచితంగా అందజేసిన లయన్.డా.ఎం.కె.మిశ్రో

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : లక్ష్మీ నర్సు పేట గ్రామంలో గల మోడల్ ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థి -విద్యార్థినీలు అందరికీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సామాజిక వేత్త లయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్పర్సన్ దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు గురు దేవా ఛారిటీ బుల్ ట్రస్ట్ ప్రతినిధి సీఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లయన్.డా.ఎం.కె.మిశ్రో ఉచితంగా గణిత భోధిని పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయులు రమాదేవి లయన్.డా.మిశ్రో పాఠశాల అభివృద్ధి మరియు సమాజ సేవలు మరువలేనివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి, ఉపాధ్యాయులు ఎన్.రామారావు, పి.లక్ష్మణరావు, టి.ఉపేంద్ర మరియు విద్యార్థి - విద్యార్థినీలు పాల్గొన్నారు.

వికలాంగుల పొట్ట కొట్టడం కూటమికి తగునా..?

విశాలాంధ్ర - సోంపేట : వికలాంగుల పింఛను విషయంలో రాష్ట్రంలోని కూటమి సర్కారు నిర్వాకంపై కంచిలి మండల వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతినెలా ఇచ్చే పింఛను భృతిపై ఆధారపడి అరకొర బతుకులు సాగిస్తున్న దివ్యాంగుల పట్ల ప్రభుత్వం కరుణ చూపాల్సింది పోయి వారి పొట్ట కొట్టడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. ఎంపీపీ పైల దేవదాసురెడ్డి పలువురు వైకాపా నేతలతో కలిసి శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 1500 మంది దివ్యాంగులపై అనర్హత మార్కు వేసి పింఛన్లు కత్తిరించడం ఈ మంచి ప్రభుత్వానికి ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కంచిలి మండలంలో కొత్త ప్రభుత్వం వచ్చిన నాటికి 9912 పింఛన్లు ఉండగా ఆగస్టు నెల నాటికి 9581 పింఛన్లుకు తగ్గించడం కూటమి సర్కార్ పనితీరుకు నిదర్శనమని అన్నారు. ఒక్క మండలంలోనే 300కు పైగా పింఛన్లు తొలగించి 121 మంది వికలాంగులకు రద్దు చేస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ దిక్కుమాలిన చర్యగా పేర్కొన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత హామీలు నీరు గార్చడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. ఎన్నికల్లో 50 ఏళ్లు నిండిన బీసీలకు పింఛన్లు ఇస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఎన్నికల తర్వాత ఆ విషయాన్ని మర్చిపోవడం బాబు తీరుకు నిదర్శనమని అన్నారు. పేదలను, మైనార్టీలను, ఎస్సీ, ఎస్టీలను అధికారంతో మోసం చేయడం దేశంలో ఒక్క చంద్రబాబుకే సాధ్యమని పేర్కొన్నారు. సంపద సృష్టిస్తానని ఇలా మోసాలకు పాల్పడడం వేలాది ఎకరాలు అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టడం చంద్రబాబు నైజమని విమర్శించారు. 2023లో ఖరీఫ్ పంట నష్టపరిహారాన్ని ఇప్పటి వరకు చెల్లించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని దుయ్యబట్టారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా యూరియా కొరత సృష్టించి రైతన్నలను దగా చేయడం కూటమి సర్కార్ అసమర్థతకు నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు దుర్గాశి ధర్మారావు, లడ్డుకేశవపాత్రో, గొనప సింహాచలం, సురేష్, పలికల జయరాం, మద్దు అభియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై చెత్త వేస్తే జరిమానా కట్టాల్సిందే

విశాలాంధ్ర - టెక్కలి : రహదారులపై ఉన్న దుకాణదారులు చెత్త వేస్తే జరిమానా కట్టాల్సిందే అని ఈవో వెంకట శ్రీనివాసరావు అన్నారు. మేజర్ పంచాయతీలో రహదారులపై నిత్యం చెత్త కుప్పలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ఈవో తమ సిబ్బందితో కలిసి శుక్రవారం దుకాణాలు వద్ద ఉన్న చెత్తను చూసి జరిమానా వేశారు. వివిధ ప్రాంతాలలో ప్రతిరోజు చెత్త తొలగించిన చోట మళ్లీ వేస్తే జరిమానా వేస్తామని హెచ్చరించారు. కిరాణా, కూరగాయలు, పండ్లు, సెల్ ఫోన్లు, ఫాన్సీ, దుస్తుల వివిధ దుకాణాలు వద్ద చెత్త కుప్పలు విపరీతంగా ఉంటు న్నాయని, ఆ దుకాణాలు వద్ద డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇకనుండి రహదారులపై దుకాణాలు వద్ద చెత్త కుప్పలు కనబడితే తప్పనిసరిగా జరిమానా విధిస్తామని తెలిపారు. పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైసీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

మందస ఎంపీపీ డొక్కరి దానయ్య

విశాలాంధ్ర - మందస : వైసీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మందస ఎంపిపి డొక్కరి దానయ్య అన్నారు. శుక్రవారం మండలం బాహడపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ దానయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేస్తూ వైసీపీని అధికారం లోకి తెచ్చుకొని జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి గా, మాజీ మంత్రి డా. అప్పలరాజును ఎమ్మెల్యేగా గెలుపించికోవాలని కోరారు. ఇటీవల మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పై సామాజిక మాద్యమాల్లో టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను ధీటుగా ఎదుర్కోవాలని, డాక్టర్ సీదిరి అప్పలరాజు మంత్రిగా ఉన్న సమయంలో పలాస నియోజక వర్గంకు చేసిన అభివృద్ధి మరియు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన విషయాన్ని ప్రజలకు మరొక్క సారి గుర్తుచేశారు. ఈ నియోజకవర్గంలో చాలా మంది టీడీపీ ముఖ్య నాయకులుగా చెలామణి అవుతున్న వారు కూడ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సియమ్ రిలిఫ్ ఫండ్ అందుకున్నారంటే అది డాక్టర్ సీదిరి మానవత్వం అని సమావేశంలో ఆయన కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ మంత్రి డా:సీదిరి అప్పలరాజు సూచనలతో గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే భాగంగా బహడపల్లి పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బొడ్డు. ఉమాపతి ఆధ్వర్యంలో సమావేశంపై పంచాయితీ కార్యవర్గాన్ని నియమించడం జరిగిందన్నారు. పంచాయతీ అధ్యక్షులుగా మామిడి. తులసయ్య, రైతు విభాగం అధ్యక్షులుగా సాలిన. కృష్ణారావు, యువజన అధ్యక్షులుగా మద్దిల. జగదీశ్ లను ఏకీగ్రీవంగా ఎన్నికోవడం జరిగిందని దానయ్య తెలిపారు.

రచ్చబండపై చదువులు

విశాలాంధ్ర - నందిగాం : మండలం సైలాడ పంచాయతీ బంజీరుపేటలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇబ్బందుల్లోపడ్డారు. 1986లో నిర్మించిన ఈ పాఠశాల భవనం నేటికి శిథిలావస్థకు చేరుకుంది. భవనం శ్లాబు, గోడలు బీటలు వారిపోవడంతో చిన్న చిరుజల్లులు కురిసినా పాఠశాల లోపలికి నీరు చేరుతోంది. విద్యార్థులు ఆ నీటిలో కూర్చోలేక దిక్కుతోచని పరిస్థితిలో చదువు కొనసాగిస్తున్నారు. వర్షం పడితే గ్రామంలో ఉన్న రచ్చబండే వారికి దిక్కు. 12 మంది విద్యార్థులకు రచ్చబండపైనే చదువు చెప్పాల్సి వస్తోందని ప్రధానోపాధ్యాయుడు ఉమాబాబు తెలిపారు. నూతన భవనం కోసం ఆర్వీఎం అధికారులకు నివేదించామని నిధులు మంజూరైతే నూతన పాఠశాల భవనం నిర్మిస్తామని ఎంఈవో జి. నరసింహులు పేర్కొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి!

విశాలాంధ్ర - నరసన్నపేట : ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పండుగ సంధర్భంగా నవరాత్రులు నిర్వహించే కమిటీ ప్రతినిధులు వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎం.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక సి.ఐ కార్యాలయంలో ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, కె.వి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ శాఖ సింగిల్ విండో విధానం తీసుకువచ్చిందని తెలిపారు. గణపతి నవరాత్రులు నిర్వహించే నిర్వాహకులు, వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలని, దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ధరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ (సబ్-ఇన్‌స్పెక్టర్)కు వెళ్తుందని, ఎస్.ఐ ఆధ్వర్యంలో పంచాయితీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖ సిబ్బంది బృందంగా ఏర్పడి, మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శిస్తారని అన్నారు. మండపాల ఏర్పాటు పోలీస్ నిబంధనలకు అనుగుణంగా ఉంటే మంజూరు అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. వినాయక విగ్రహ మండపాలను రోడ్డుకు అంతరాయం లేకుండా ఉండాలని, అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ, సిహెచ్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా భారతమాత ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం కపాసుకుద్ది గ్రామంలో వెలసిన భారతమాత ఆలయం వార్షికోత్సవంను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం 108 మంది మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి అన్నసంతర్పణ కార్యక్రమం జరిపించారు. సాయింత్రం ప్రముఖ వయోలిన్ విద్వాంసులు మావుదూరి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో సంగీత కచేరి నిర్వహించారు.చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు భారతమాతను దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో భారతమాత యువజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రుజువు చేసుకొని స్థలంపైకి రావాలి : వివాద స్థలంపై కోట్ని వెంకటరమణ

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని దంతం వీధిలో సర్వే నెం 230/7లో 9 మూరలు స్థలం తన తండ్రి కోట్ని సత్యన్నారాయణ వారసత్వంగా తనకు సంక్రమించిందని, ఈ స్థలంను తల్లి దమయంతమ్మ విక్రయించిందని తాళాసు నాగేశ్వరరావు నకిలీ పత్రాలు సృష్టించి ఆ స్థలం కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని కోట్ని వెంకటరమణ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివాదాస్పద స్థలంలో పనులు చేయిస్తున్నారని కోర్టులో రుజువు చేసుకొని తీర్పు ఆధారంగా స్థలంపైకి రావాలని కోరారు. అలా కాకుండా దౌర్జన్యంగా స్థలంలో పనులు చేపట్టడం సరికాదని కోట్ని వెంకటరమణ అన్నారు. 9 మూరల స్థలం దమయంతమ్మ తనకు విక్రయించందని, దానిని తన భార్య పేరున రిజిస్టర్ చేయించానని నాగేశ్వరరావు కోర్టుకు, అధికారులకు నమ్మబలుకుతున్నారన్నారు. ఈ స్థలం కోసం నాగేశ్వరరావుపై తాను సోంపేట కోర్టులో దావా వేయడం జరిగిందని వాటిపై వాదనలు కొనసాగుతున్నాయన్నారు. దీనిపై తాను ఇంజక్షన్ ఆర్డర్ కూడా పొందానని, ఇరువర్గాలు కోర్టు తీర్పు వెలువడిన వరకు స్థలంపైకి వెళ్లకూడదని హెచ్చరిందన్నారు. అయినప్పటికీ ఒక కాంట్రాక్టర్ ద్వారా నాగేశ్వరరావు స్థలంలో నిర్మాణాల కోసం పనులు చేయిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని తాను కమీషనర్, పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కోర్టు అయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, సరైన పత్రాలు చూపించినా స్థలం వదులుకోవడానికి తాను సిద్ధమేనన్నారు. అలా కాకుండా దౌర్జన్యంగా పనులు చేపట్టడం సరికాదన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా కమలమ్మ

విశాలాంధ్ర - కొత్తూరు : హిరమండలం ఏ.ఏం.సి పాలక మండలి డైరెక్టర్ గా కొత్తూరుకు చెందిన చొడవరపు కమలమ్మను ప్రభుత్వం నియమించింది గురువారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. కమలమ్మ భర్త గోవిందరావు. కొత్తూరు బీజేపీ పార్టీలో సీనియర్ అయితే ప్రస్తుతం ఆయన ఆ పార్టీకి కాస్తా దూరంగా ఉన్నారు తన భార్య కమలమ్మ ను ఏ.ఏం.సి డైరెక్టర్‌గా నియామకంకు సహకరించిన టీడీపీ బీజేపీ పెద్దలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

కంపాక్టర్ బిన్ ప్రారంభించిన ఎమ్మెల్యే కూన

విశాలాంధ్ర - ఆమదాలవలస : పట్టణ పారిశుధ్య నిర్వహణలో భాగంగా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించేందుకు కంపాక్టర్ బిన్ వాహనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ ప్రారంభించారు. వివాహనాన్ని చెత్త సేకరణకు వినియోగించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. సేకరించే చెత్త డంపింగ్ యార్డ్‌కి తరలించిన తర్వాత రీసైక్లింగ్ విధానాన్ని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. పట్టణంలో రోజుకు సుమారు ఇరవై టన్నుల చెత్త సేకరణ జరుగు దానిని డంపింగ్ యార్డ్ కి తరలించే పరికరాలను పురపాలక సంఘానికి అందజేశారు. 15 వ ఆర్థిక సంఘం నిధులు లతో కంపెక్టర్ వాహనము 45 లక్షలు తో కొనుగోలు చేసినట్లు, అలాగే విన్స్ కూడా కొనుగోలు చేసినట్లు కమిషనర్ తమ్మినేని రవి ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులతో పాటు వార్డ్ ఇన్చార్జిలు పట్టణ తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం : మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్దే ధ్యేయంగా కృషి చేయడం జరుగు తుందని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ రెండవ వార్డు నెమలి నారాయణ పురం గ్రామంలో రెండు లక్షల రూపాయలతో డ్రైనేజి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయంలో నాలుగేళ్లలో మున్సిపాలిటీలోని అన్ని వార్డులను రాజకీయాలకు అతీతంగా దశల వారిగా అభివద్ధి పనులు కేటాయించి వాటిని పూర్తి చేయడం జరిగిందన్నారు. అదే విదంగా తాగునీటి సమస్య కూడా పరిష్కరించడం జరిగిందన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో మరిన్న అభివద్ధి వనులు చేవడుతూ మున్సిపాలిటీని అభివృద్ధి దిశలో తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు, కొరికన శంకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్ర అభివృద్ధికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర - పోలాకి : మండల కేంద్రం పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన అభివృద్ధి సలహా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో మాతా శిశు మరణాలు జరగకుండా తగుజాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూఆసుపత్రిలో సమావేశ మందిరం అత్యవసరంగా భావించాలని శాసన సభ్యులను కోరగా ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ మీటింగ్ హాల్ నిర్మాణానికి అధికారులతో మాట్లాడి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ మాట్లాడుతూ శానిటరీ అటెండెన్స్ వాచ్మెన్ మరియు ఒక స్టాఫ్ నర్స్ పోస్ట్ ఖాళీగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ జనవరి నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెయింటినెన్స్ ఖర్చు నిమిత్తం 60 వేలు రూపాయలు ఖర్చు అయినట్లు ఎమ్మెల్యే ముందు తీర్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రవికుమార్ మాట్లాడుతూ నీటి ద్వారా దోమల వ్యాప్తి చెందే వ్యాధులు మన ప్రాంతాల్లో ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ రోగులకు అన్ని మందులు సాధనాలు సంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలాకి వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పిఎసియస్ ఛైర్మన్ ఖైరి భాస్కరరావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సూర్య ప్రకాష్, డాక్టర్ సుప్రియ, డాక్టర్ రజనీకాంత్, నేత్ర వైద్యాధికారి ఎస్ సాంబశివరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, పర్యవేక్షకులు శేఖర్ బాబు, బరాటం లక్ష్మి, కిల్లి వేణుగోపాల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రాగునీరు వృధా పట్టించుకునే వారు లేరు

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రం సారవకోట ప్రధాన వీధిలో ప్రజలకు తాగునీటి కోసం సరఫరా చేస్తున్న త్రాగునీరు వృధా అవుతున్నప్పటికీ పట్టించుకునే వారు లేరనే విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. చుక్కనీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్న ఈ రోజుల్లో ఇలా త్రాగునీరు వృధా అవ్వడం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాగునీరు సరఫరా చేసే కుళాయిలకు ట్యాప్లు లేక పోవడం ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శలు ఉన్నాయి. త్రాగునీటి కోసం పంచాయతీ లక్షల ఖర్చు చేస్తున్న రూపాయల్లో తేలిపోవలసిన ట్యాపులను ఏర్పాటు చేయకపోవడం అనేక విమర్శలు వస్తు న్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పరిశీలించి త్రాగునీరు వృధా కాకుండా చూడాలని కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌ని కలిసిన జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు

విశాలాంధ్ర - హిరమండలం : నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి రామకృష్ణకి, జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ మార్కెట్‌యార్డ్ అభివృద్ధి కోసం కృషిచేయ్యాలని, రైతులు పండించిన వాణిజ్య పంటలకు స్థానికం గానే మార్కెటింగ్ సౌలభ్యం కల్పించి మార్కెట్ యార్డ్ అభివృద్ధి చెందే విధంగా కృషి చెయ్యాలని సూచించారు. ఈ భేటీలో పాతపట్నం నియోజకవర్గం 5 మండలాల బీజేపీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు తాడేలా భూపతి, జిల్లా కార్యదర్శులు పనుకు సూర్యనారాయణ, కాపలా దమయంతి పూర్వ ఉపాధ్యక్షులు దుక్క శ్రీకాంత్ రెడ్డి, పూర్వ జిల్లా కార్యదర్శి వలురౌతు ప్రసాద్, కొత్తూరు మండల అధ్యక్షులు బురడా భాస్కరరావు, హిరమండలం మండల అధ్యక్షులు రెళ్ల ఢిల్లీశ్వరరావు, ఎల్ ఎన్ పేట మండల అధ్యక్షులు మహంతి రవి, పాతపట్నం మండల అధ్యక్షులు పడాల షణ్ముఖరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహామూర్తి, పాతపట్నం మండల ప్రధాన కార్యదర్శి బడియాల బాబురావు, దారపు గోవింద్, హిరమండలం ప్రధాన కార్యదర్శి తిరుపతి, చల్లా ఈశ్వర్, పడాల తిరుపతిరావు, పైల భాస్కరరావు, మాజీ ఎంఈఓ మద్ద శ్రీధర్ తిరుపతి, జనసేన నాయకులు మామిడి బాబ్జి ఉన్నారు.

శిథిలావస్థలో అక్కుపల్లి పి.హెచ్.సి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలంలో అక్కుపల్లి పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో ఉందని, దానిని వెంటనే తొలగించాలని అక్కుపల్లి స్థానికులు సింగుపల్లి బాలక్రిష్ణ కోరారు. పాత ఆసుపత్రిలో ఎలుగుబంట్లు, పాములకు నిలయంగా మారడంతో అక్కుపల్లి గ్రామస్తులు, ఆసుపత్రికి వచ్చే రోగులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి శిథిలావస్థలో ఉన్న ఆసుపత్రి భవనాలను తొలగించాలని కోరారు.

కనక దుర్గ అమ్మవారికి అలంకరణ

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలం బారువ గ్రామంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా కనక దుర్గ అమ్మవారిని మొగలి పువ్వులతో అలంకరించారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర - కవిటి : ఊరూ వాడా వినియకుడిని కొలువుదీర్చేందుకు మండపాలు సిద్ధమవుతున్నాయి. నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్నాయి. విగ్రహాలు నెలకొల్పేవారు పోలీసుశాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కవిటి ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు పోలీసుస్టేషన్కు రావాల్సిన పనిలేకుండానే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం పోలీస్ శాఖ వెబ్సైటులో వివరాలు నమోదు చేసుకుని ఎలాంటి రుసుములు లేకుండా ఉచితంగా సింగిల్ విండో విధానంలో అనుమతి పొందే అవకాశాన్ని పోలీసుశాఖ కల్పించింది.

ఈ నిబంధనలు పాటించాలి...

గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకునేవారు ముందుగా కమిటీని ఏర్పాటు చేసుకొని బాధ్యత తీసుకోవాలి.పబ్లిక్ ప్రదేశాలలో మండపాలు ఏర్పాటు చేసేవారు ఆన్లైన్ ద్వారా అనుమతి తీసుకోవాలి.వ్యక్తిగత స్థలాలలో విగ్రహాలు పెట్టేవారు యజమాని అనుమతి తీసుకోవాలి. మైకులు, సౌండ్బాక్సులకు డీఎస్పీ అనుమతి తప్పనిసరి. డీజేలకు అనుమతి లేదు. రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు జరపరాదు. విద్యుత్తు కనెక్షన్ కోసం విద్యుత్తుశాఖ అనుమతి తీసుకొని షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతర మతాల ప్రజలకు, ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలగకుండా చూడాలి. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు ఇతర అనుచిత కార్యక్రమాలు జరపరాదు. అలా అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నిమజ్జనం, ఊరేగింపుల సమయంలో మద్యం సేవించడం,శాంతిభద్రతలకు భంగం కలిగించరాదు.అలా జరిగితే వారిపై కఠిన చర్యలు తప్పవు. ఊరేగింపు తేదీలు, కార్యక్రమ వివరాలు, వాహన డ్రైవర్ల ఆధార్ కాపీలు పోలీసులకు ముందుగానే ఇవ్వాలి.

ప్రయోగాత్మకంగా డ్రోన్‌తో నానో యూరియా పిచికారి

విశాలాంధ్ర - జలుమూరు : లింగాలవలస రెవెన్యూ పరిధి చల్లవానిపేట గ్రామంలో క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా డ్రోన్ సహాయంతో స్ప్రే కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం నానో యూరియా నానో డీఏపీ ఎరువులను ఈ యంత్రంతో పంట పొలాల్లో పిచకారి చేసినట్లు నరసన్నపేట సహాయ సంచాలకులు ఎల్వి మధు తెలిపారు. చల్లవానిపేట గ్రామానికి చెందిన పంచి రెడ్డి రామచంద్రావు పొలంలో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మరో 15 రోజుల్లో పిచికారి చేసిన పొలాలని పర్యవేక్షిస్తే రిజల్ట్ తెలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కింజరాపు రవికుమార్, ఐఎఫ్ ఎఫ్ కో మేనేజర్ మరియు ఏఈఓ వివిఏ పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ పంచ రెడ్డి రామచంద్రావు, ముఖ్య రైతులు బుక్క కామేశ్వరరావు, పాగోటి వెంకట్రావు, పొన్నాన రామారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటుపరం కాకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆమదాలవలస : దశలవారీగా విశాఖ ఉ ప్రైవేట్ పరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కూటమి నాయకత్వం కనీసం నోరు మెద పడం లేదని వైఎస్ఆర్సివి యువజన విభాగం నాయ కులు తమ్మినేని చిరంజీవి నాగు అన్నారు. శుక్రవారం తన నివాసంలో మాట్లాడుతూ 32 విభాగాలను విడ దీసి దశలవారీగా ప్రైవేట్ కంపెనీలకు అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని దానిని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడంలో విఫలమైందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పాటు చేసుకు న్న పరిశ్రమ ప్రైవేటుపరం కాబోతుంటే ఎన్నికల ముం దు ఎవరా విదేశీ కంపెనీలు ఇక్కడికి వచ్చేదని ఊదర గొట్టుడు ఉపన్యాసాలు ఇచ్చిన ఎంపీ రామ్మోహన్ నాయుడు కనీసం మాటమాత్రానికైనా కేంద్రాన్ని ప్రశ్నిం చకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. ఇప్ప టికే 1150 మంది కార్మికులు రోడ్డున పడ్డారని ప్రైవే టుపరమైతే ఉద్యోగులు రోడ్డున పడతారని పూర్తిగా ఉపాధి కోల్పోతారని ఆవేదన చెందారు. కేంద్ర ప్రభు త్వం మాదారం మైన్స్ కు అందించే ప్రతిపాదనలు సిద్ధం చేసిందని వీటిని కేంద్రమంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు అడ్డుకోకపోతే జిల్లా ప్రజలు ఆగ్రహానికి గురికాక తప్పదు అన్నారు. ఎన్నికల ముం దు ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చవలసిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఎంపీ ప్రస్తుత మంత్రి రామ్మో హన్ నాయుడు పై ఉందని స్పష్టం చేశారు. గత వైసివి పాలనలో విశాఖ ఉక్కును తరలించేది లేదని అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజాగ్రహాన్ని చవిచూడక ముందే ప్రభు త్వం కళ్ళు తెరిచి విశాఖ ఉక్కు తరలిపోకుండా కాపాడాలన్నారు. ఉపాధి కల్పిస్తామని హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి ఉక్కు ఫ్యాక్టరీ ఎమ్మెల్సీ ఉపాధి ఇస్తారా అని నిలదీశారు. ప్రజా ప్రయోజనాలు కాపాడే విధంగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాన్ని చేప ట్టకు తప్పదని స్పష్టం చేశారు. ఎన్డీఏ లో భాగస్వా ములైన కూటమి నాయకులు కేంద్రాన్ని నిలదీయాలి గాని అక్కడ మోకరుల రాదని నిలదీశారు. కమిషన్ల కోసం ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేస్తుంటే చోద్యం చూసే నీవు కేంద్ర మంత్రివేనా అని అన్నారు. ప్రజా తిరుగుబాటు ముందు ప్రభుత్వం నిస్సహాయ స్థితి పడకుండా ముందుగా మేలుకోవాలన్నారు. విశాఖ ఉక్కు సాధన తోనే ఆంధ్రకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గేదెలు పట్టివేత

విశాలాంధ్ర - మందస : అక్రమంగా తరలిస్తున్న 16 పశువులను మందస పోలీసులు పట్టుకున్నారు. మండలం కొర్రాయి గేటు జాతీయ రహదారిపై శుక్రవారం, మందస పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా ఒరిస్సా నుండి విజయనగరం అలమండ సంతకు అక్రమంగా తరలిస్తున్న 16 గేదెలతో ఉన్న లారీ ను ఎస్.ఐ కృష్ణ ప్రసాద్ పట్టుకున్నారు. డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పట్టుబడ్డ పశువులను గోశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంచార కులాలను బలోపేతం చేయటమే బీజేపీ లక్ష్యం

బిజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మణెమ్మ

విశాలాంధ్ర - నరసన్నపేట/సారవకోట : నియోజకవర్గంలోని సంచార కులాలను బలోపేతం చేయటమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని బి.జే.పి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, కొనుతల మణెమ్మ అన్నారు. శుక్రవారం ఆమె సారవకోట మండలంలోని లోమేదర, కురిడింగి గ్రామంలో కుమ్మరి కులస్థులను కలిసి, ప్రధాన మంత్రి, నరేంద్ర మోడీ మేదర, కుమ్మరి, గంగిరెద్దుల ఓబిసి కులాలకు అమలు చేస్తున్న ప్రత్యేక పథకాల గూర్చి అవగాహన కల్పించారు. కుల వృత్తులను ప్రోత్స హించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలను అతి తక్కువ వడ్డీకి బిజేపి ప్రభుత్వం ఇస్తుందని, దీనిని ఓబిసి కులాలందరూ సద్వినియోగం చేసుకోవాలని మణెమ్మ కోరారు.

అవినీతికి పాల్పడిన పోలీసు అధికారులు పై వేటు తప్పదు

విశాఖపట్టణం రేంజ్ డి.ఐ.జి గోపినాథ్ జట్టి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : విధి నిర్వహణలో అవినీతి, ఆరోపణలకు పాల్పడిన పోలీసు అధికారులను బదిలీ తోపాటు, వ్యవహార శైలి మార్చుకోకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవని, ఇప్పటికే పలువురు పోలీసు అధికారులపై ఫిర్యాదులు అందాయని, అట్టి వారిని బదిలీ చేయడం తోపాటు వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పేర్కొన్నారు. శిక్షలు శాతం పెరిగేలా కేసులు దర్యాప్తు ఉండాలి అని, మహిళ భద్రత, బాధితులకు తక్షణ న్యాయం అందించడమే పోలీసు మొదటి విధిగా విధి నిర్వహణలు నిర్వర్తించాలని పోలీసు అధికారులను రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి ఆదేశించారు.జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో,జిల్లా ఎస్పి కెవి మహేశ్వర రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల ఉన్నత అధికారులతో శుక్రవారం శ్రీకాకుళం పట్టణంలో స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన అర్ధ వార్షిక నేర సమీక్ష మరియు సమన్వయ సమీక్ష సమావేశానికి విశాఖపట్టణం రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి ముఖ్య అతిథిగా, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్,జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలనా విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ క్రమంలో ముందుగా జిల్లా ఎస్పి గడచిన ఆరు నెలల కాలంలో జిల్లాలో నమోదైన కేసులు,దర్యాప్తులో సాధించిన పురోగతి, నేర నియంత్రణ, బీట్ సిస్టమ్,రికవరీ చేసిన కేసు ప్రాపర్టీ, నారీ శక్తి, సంకల్పం అవగాహన కార్యక్రమంలో భాగంగా మహిళా భద్రత, ప్రమాదాల నివారణ,మాదక ద్రవ్యాలు నియంత్రణ ఎన్ఫోర్స్మెంట్ చర్యలు భాగంగా తీసుకుంటున్న చర్యలపై రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి కి తెలియజేశారు. రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి మాట్లాడుతూ..జిల్లాలో నేరాలు నియంత్రణ పోలీసు అధికారులు ప్రత్యేక కార్యచరణతో పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సాంకేతిక శాస్త్రీయ కోణంలో కేసులు దర్యాప్తు చేపట్టి శిక్షల శాతం పెరిగాల కేసులు దర్యాప్తు ఉండాలన్నారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, మాదకద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు నివారణ, సైబర్ మోసాలు నియంత్రణకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. పోలీస్ స్టేషన్ నకు వచ్చే బాధితులు పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపి న్యాయం అందించాలని అప్పుడే పోలీస్ శాఖ కీర్తి పెరుగుతుందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులకు శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతి శనివారం పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు ను పోలీసు తోపాటు, బాల బాలికలు సంరక్షణ, చైల్డ్ లైన్, రెవెన్యూ,హెల్త్, మెడికల్, విద్యా, ఇతర విభాగాలు అధికారులు సందర్శించి విద్యార్థులతో మమేకమవుతూ వారి అభిప్రాయాలు తెలుసుకునే కార్యక్రమాలు నిర్వహించాలి అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులతో అధికారులు సన్నిహితంగా వారి సమస్యలు, అభిప్రాయాలు స్వీకరించి వారి సమస్యలు పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్' బాల్య వివాహులు, కిడ్నాప్, ఈవ్‌టీజింగ్ వంటి జాగ్రత్తలు, మాదక ద్రవ్యాలు వలన కలిగే అనర్థాలు, ఫోక్సో వంటి చట్టాలు, డయల్ 112,1091,1098, 181,1930,1972,శక్తి యాప్ వంటివి అవసరమైన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జడ్జి జునైద్ అహ్మద్ మౌలనా మాట్లాడుతూ కేసులు దర్యాప్తు, దర్యాప్తులో ఎదురయ్యే లీగల్ సమస్యలు నేర ప్రవృత్తి, నేర తరహా వంటి పలు అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ లతో చర్చించాలని తెలిపారు. నూతన చట్టాలు పై అవగాహన అవసరమని, చట్టాలు అవగాహన పై నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి ప్రతి అంశాన్నీ పఠించాలని పేర్కొన్నారు. కేసులు దర్యాప్తు చట్ట పరిధిలో జరపి, నియమాలను పాటిస్తే శిక్షలు పడతాయని అన్నారు. పెండిగ్ కేసులకు వీలైనంత మేరకు సీసీ నెంబర్ల మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ నేరాలు నివారణకు తీసుకున్న పటిష్టమైన చర్యలతో నేరాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. జిల్లాలోని పోలీస్ శాఖకు సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.గత ఏడాదిలో అత్యధికంగా కేసులు డిస్పోజెల్ చేయగలిగాం అని ఎస్పీ పేర్కొన్నారు. ఈఅర్ధ వార్షిక సమావేశంలో భాగంగా శుక్రవారం ఉదయం ఎచ్చెర్ల మండలం చిన్నరావుపల్లి పోలీస్ ఫైరింగ్ రేంజ్ లో జిల్లాలో గల పోలీస్ అధికారులు అందరూ ఫైరింగ్ సాధనలో పాల్గొని ఫైరింగ్ చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం టౌన్ డిఎస్పీ వివేకానంద, ఎస్బి సిఐ ఇమ్మన్యుల్ రాజు వివిధ శాఖల అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన శిక్షణ కేంద్రం పనులు పూర్తి చేయాలి

విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర స్పోర్ట్స్/క్రైం : జిల్లాలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్.సి.టి.పి.సి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో శిక్షణార్థులకు అవసరమైన సౌకర్యాలను, మౌళిక వసతి ఏర్పాట్లు పరిశీలనకై శ్రీకాకుళం గ్రామీణ మండలం తండేవలస లో ఉన్న జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డి.టి.సి) శుక్రవారం విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తో కలిసి సందర్శించారు. ఈ క్రమంలో ముందుగా పోలీస్ శిక్షణ కేంద్రంలో పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్స్, వంట గాడి,తరగతి గదులు, వైద్య గది,పరేడ్ గ్రౌండ్ ను పోలీస్ అధికారులతో కలసి పరిశీలించి, శిక్షణ నిమిత్తం అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చేపట్టవలసిన మరమ్మత్తు పనులను పరిశీలించి, భద్రత పరమైన తగు జాగ్రత్త చర్యలు ముందస్తుగా చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు అందించారు. సిబ్బంది వివరాలు పై ఆరా తీసి శిక్షణ కేద్రంలో తరగతి గదులను, భోజనం గదులను, బ్యారక్‌లను, స్నానపు గదులను పరిశీలించి అదనంగా చేయవలసిన ఏర్పాట్లు గురించి డిఐజి అధికారులకు పలు సూచనలు చేశారు. శిక్షణ కేంద్రంలో పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించి, శిక్షణార్థులకు శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్, ఇతర శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే మైదానాలను పరిశీలించారు. క్లాస్ రూమ్స్, కంప్యూటర్ గది,రన్నింగ్ ట్రాక్, పరేడ్ గ్రౌండ్స్ ను పరిశీలించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రేంజ్ డీఐజీ వెంట జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, ఆదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద శేషాద్రి ప్రసాదరావు, సీఐలు ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు

వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - హిరమండలం : గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకునే వారు ముందుగా కమిటీని ఏర్పాటు చేసుకొని బాధ్యత తీసుకోవాలని హిరమండలం ఎస్సై యం డి యాసిన్ శుక్రవారం తెలిపారు. పబ్లిక్ ప్రదేశాలలో మండపాలు ఏర్పాటు చేసేవారు సంబంధిత మున్సిపాలిటీ/పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.వ్యక్తిగత స్థలాలలో విగ్రహాలు పెట్టేవారు యజమాని అనుమతి తీసుకోవాలి. తమండపాలు, విగ్రహాలు ఎక్కడ ఏర్పాటు చేసినా ప్రజలకు, ట్రాఫిక్‌కి ఎటువంటి ఆటంకం కలగరాదు. మైకులు, సౌండ్ బాక్స్‌లకు డీఎస్పీ అనుమతి తప్పనిసరి. డీజే లకు అనుమతి లేదు. రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు జరపరాదు. హుండీలు, విలువైన వస్తువులు ఉంచినట్లయితే పూర్తి బాధ్యత కమిటీదే. విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖ అనుమతి తీసుకొని, షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతర మతాల వారికి, ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలగకుండా చూడాలి.. విభేదాలు రాకుండా శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డాన్సులు, ఇతర అనుచిత కార్యక్రమాలు జరగరాదు. ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ఎవరినీ బలవంతంగా చందాలు అడగరాదు. బలవంతపు వసూళ్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాము.భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూ లైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలిఅగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలినిమజ్జన ఊరేగింపుల సమయంలో మద్యం సేవించడం, శాంతిభద్రతలకు భంగం కలిగించడం అస్సలు అనుమతించబడదు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము ఊరేగింపు తేదీలు, కార్యక్రమ వివరాలు ముందుగానే పోలీసులకు తెలియజేయాలి. వాహనాల డ్రైవర్ల ఆధార్ కాపీలు, వివరాలు ఇవ్వాలిమండపాల ఏర్పాటు వివరాలు, నిబంధనలు పాటిస్తామన్న నోటరీ పత్రం పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని ఎస్సై తెలిపారు.

ఐటెప్ కోర్సులోకి కౌన్సిలింగ్ ప్రారంభం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : నాలుగేళ్ల సమీకృత విద్యా కార్యక్రమం (ఐటెప్) కోర్సులోకి ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబందించి కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం డా. బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. మొత్తం 110 సీట్లుకు గాను బీ.ఎస్సీ., బి.ఇడి. కేటగిరిలో 53 సీట్లు, బి.ఎ., బి.ఇడి. లో 27 సీట్లు భర్తీ అయ్యాయి. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏం. అనురాధ పర్యవేక్షణలో జరిగిన ఈ కౌన్సిలింగ్ లో, అకడమిక్ అఫైర్స్ డీన్, డా. కె. స్వప్నవాహిని, విద్యా విభాగం సమన్వయకర్త డా. జె. ఎల్. సంధ్యారాణి పాల్గొని, హజరైన అభ్యర్థుల సంబంధిత ధృవ పత్రాలను పరిశీలించారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డా. హెచ్. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ కౌన్సిలింగ్ శనివారం కూడా కొనసాగునున్నది.

రైతులు క్రాఫ్ట్ ఇన్సూరెన్స్.. ఈనెల 30లోగా కట్టకపోతే పంట బీమా వర్తించదు

విశాలాంధ్ర - పోలాకి : పోలాకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో రైతులంతా 2025 ఖరీఫ్ సీజన్ సంవత్సరానికి గాను ఆగస్టు 30వ తేదీ లోగా చెల్లించకపోతే ఇన్సూరెన్స్ భీమా ప్రి మియం వర్తించదని సంఘ చైర్పర్సన్ బైరి భాస్కరరావు సీఈఓ రాంబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా పోలాకి మార్కెట్‌లో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు చీఫ్ మేనేజర్ ఇప్పిలి సీతారాం, పొన్నాడ మల్లేశ్వరి రైతులతో మాట్లాడుతూ వ్యవసాయ సహకార సంఘము నందు రుణాలు తీసుకున్న రైతులు అందరూ వన్ బి, ఆధార్ కార్డు మరియు బ్యాంక్ అకౌంట్ ఫోన్ నెంబర్ అన్ని జిరాక్స్ కాపీలతో తీసుకొని రావాలని, ఇన్సూరెన్స్ ప్రీమియం ఒక ఎకరాకి 170 రూపాయలు క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ చెల్లించాలని తెలిపారు.

మట్టి గణపతి విగ్రహాలు తయారు చేస్తున్న సురవరం కుమ్మరులు



విశాలాంధ్ర - జలుమూరు : ఈనెల 27న జరగబోయే గణపతి నవరాత్రులు పురస్కరించుకొని జలుమూరు మండలం సురవరం గ్రామంలో గత నెల రోజుల నుండి మట్టి గణపతి విగ్రహాలు తయారవుతున్నాయి. కొన్ని దశాబ్దాల నుండి ఈ గ్రామంలో మట్టితో అనేక దేవుని విగ్రహాలు తయారు చేయడం ఆనవాయితీ అని బొమ్మలు తయారు చేసే శిల్పి పొట్నూరు శాంతారావు అన్నారు. చిన్న బొమ్మల నుండి సుమారు పది అడుగుల బొమ్మలు తయారుచేస్తామని తెలిపారు. ముగ్గురు మనుషులు కలిసి 10 అడుగుల గణపతి బొమ్మ తయారు చేయాలంటే ఐదు రోజులు పడుతుందని దాని ఖరీదు 15000 ఉంటుందని కూలి రంగులు కలసి 10000 అవుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం రంగులు సహకరిస్తే మా కుటుంబాలు ఆర్థికంగా బాగుంటాయని లేదంటే ఎన్ని సంవత్సరాలు మట్టి బొమ్మలు చేసిన మా బ్రతుకులు మట్టిపేనని వారు అంటున్నారు.

'అన్వేష్'కు గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : క్రైస్తవ ఆరాధనతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా వ్యవరించిన ప్రత్తి అన్వేష్‌కు గౌరవ డాక్టరేట్ దక్కింది. పట్టణానికి చెందిన వై.ఎస్.ఆర్. సి.పి క్రిష్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ప్రత్తి అన్వేష్‌కు శుక్రారం శ్రీకాకుళం జిల్లా పాస్టర్స్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్, గ్లోబల్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ ఆర్గనైజేషన్‌లు సంయుక్తగా గౌరవ డాక్టరేట్‌తో ఘనంగా అభినందించారు. బిషప్‌లు గంజి ఎజ్రా, కొత్తపల్లి అబ్రహాం, జాషువా, కిరణ్, ఏసు పాదం, పీటర్ తదితరులతో పాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసంగీకులు రెవ.డా దానియేలు పాల్‌ల చేతులు మీదుగా సత్కరించిరి డాక్టరేట్ అందుకోవడం తన అదృష్టమని, భవిష్యత్‌లో వారి అంచనాలకు అనుగుణంగా సాంఘీక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్వేష్ తెలిపారు.

పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈఓ

విశాలాంధ్ర - జలుమూరు : పదవ తరగతి విద్యార్థుల్లో కనీసం అభ్యసన సామర్థ్యాలను మండల విద్యాశాఖ అధికారి మద్దు వెంకటరమణ పరిశీలించారు. సారవకోట మండలం చిన్న కిట్టాలపాడు జిల్లా పరిషత్ హై స్కూలను శుక్రవారం పరిశీలించారు. ఉపాధ్యాయు టలతో సమావేశం ఏర్పాటు చేసి అకడమిక్ అంశాలపై చర్చించారు. ఈ నెల 30వ తేదీన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరుగుతుందని ఎంఈఓ రమణ సిబ్బందికి తెలిపారు. ఉపాధ్యాయులు హ్యాండ్ బుక్కులను ఉపయోగించి పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు.

సత్యసాయి మందిరంలో ఘనంగా శ్రావణ కుంకుమ పూజలు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక మారుతీనగర్-1వ వీధిలో ఉన్న శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మందిరంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. సత్యవరాగ్రహార పురోహితులు మావుడూరు జగదీష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో సుమారు 108మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లలిత సహస్ర సామూహిక కుంకుమ పూజలు చేసి, అమ్మవారి తీర్థ, ప్రసాదాలు మహిళలకు అందచేశారు.

జానపద కళాకారులకు ఘన సత్కారం

విశాలాంధ్ర - కవిటి : ప్రపంచ జానపద కళా దినోత్సవం విజయనగరం జిల్లాలో గిడుగు రామ్మూర్తి జానపద కళా పీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద కళాకారులు కోట సెంటర్ నుండి ర్యాలీ నిర్వహించారు. బుర్రకథ, కోయ నృత్యం, మాయల ఫకీర్, తప్పెటగుళ్ళు, కోలాటం, గంగిరెద్దులు, చెక్కభజన మొదలగు కళాకారులు తమ తమ కళారూపాలను ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ మేరకు డప్పు, కోయ నృత్యం కళాకారుడు గేదెల ప్రకాష్, బుర్రకథ, ఏకపాత్రాభినయం కళా కారుడు బాలక లోకనాథం లకు గిడుగు రామ్మూర్తి జానపద కళా పీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల కళాకారులు పాల్గొన్నారు.

పీఆర్సీపై కాలయాపన తగదు

విశాలాంధ్ర - కవిటి : ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీపై నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇంత వరకు కమీషన్ ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తుందని యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబురావు, జిల్లా కార్యదర్శి ఎం. మురళి ప్రకాష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి ఎంఆర్సీ వద్ద మండల అధ్యక్షులు జానకి రావు అధ్యక్షతన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ నియమించి సమస్యను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్ష విధానంలో మార్పులు తీసుకురావాలని కోరారు. అనంతరం ఎంఈఓ ధనుంజయ మజ్జికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యం, సందీప్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాసోత్సవాలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా చివరి శ్రావణ శుక్రవారం నాడు ఘనంగా కార్యక్రమాలు నిర్వహించి సామూహిక లలితా సహస్రనామ పారాయణాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్ని అమ్మవారి అభిషేకాలు, అర్చనల్లో పాల్గొని నామ సంకీర్తనలు చేసారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళల సామూహిక లలితా సహస్రనామ పారాయణతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ సందర్భంగా శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం కార్యక్రమాల దాతలను ఆలయ అభివృద్ధి కమిటీ సత్కరించింది. నెల రోజుల పాటు పూజల్లో పాల్గొన్న మహిళలను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి బంగారు వెండి బహుమతులు అందించారు.

ఉత్సాహంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : సినీ నటుడు చిరంజీవి జన్మదినోత్సవాన్ని అభిమానులు శుక్రవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. భారీ కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకోవడంతో పాటు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో సూపరింటెండెంట్ పి. దేవేంద్ర చేతుల మీదుగా రోగులకు పండ్లు రొట్టెలు పంచి పెట్టారు. అనంతరం అన్న క్యాంటీన్ వద్ద ఆహారాన్ని అందించారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం ప్రతినిధులు కె. ప్రసాద్, అలీంఖాన్, అజయ్, మున్నా, డి. శ్రీను, చందు, రాజు, భాస్కర్, వాసు తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జనసైనికులు ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్, కలియా గౌడొ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను మెరుగుపర్చుకోవాలి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : స్థానిక జె.సి.ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు జె.సి.సాట్ స్కాలర్‌షిప్ పరీక్షను శుక్రవారం విజయవంతంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా జె.సి.ఐ అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకుని ప్రతిభను మెరుగుపర్చుకునే ప్రయత్నాలు చేయాలని అన్నారు. విద్యార్థులను చదువులో ప్రోత్స హించడం, ప్రతిభావంతులను గుర్తించ డానికి తమ సంస్థ ప్రయత్నిస్తుందని అన్నారు. స్నిగ్ధ, శిరిష, సంతోష్ సాహుల సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో జోన్ అధికారులు షణ్ముఖ్, స్వరూప్‌లు పాల్గొని తమ సహకారాన్ని అందించారు. జె.సి.ఐ సభ్యులు నవీన్, వెచ్చా వాసవి తదితరులు పాల్గొన్నారు.

సమీకృత బహుళ పంటల విధానం లాభదాయకం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి పంటకు అనుబంధంగా గట్ల పై పలు రకాల కాయగూరలు, ఆకుకూర పంటల కలయిక తో సమీకృత బహుళ పంటల విధానం రైతులకు అదనపు ఆదాయాన్ని సమకూర్చగల దని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యన్నారాయణ తెలిపారు. సంతబొమ్మాళి మండలం ఎర్నాగులపేట లో ప్రకృతి వ్యవసాయ విధానం లో అమలు చేస్తున్న సమీకృత బహుళ పంటల విధానం క్షేత్రాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. రాబోవు కాలంలో ప్రకృతి వ్యవసాయ విధానాల్లో పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చి రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు, అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్. ధనుంజయరావు, ఏ ఈ ఓ గొండు శ్రీధర్, అభ్యుదయ రైతులు తంగి రమణమూర్తి, శ్రీనివాస్, జగ్గారావు, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి మరియు నందిగాం మండలాల ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

పి.ఎం, టి.బి ముక్తి అభియాన్ ర్యాలీ నిర్వహించిన డిగ్రీ విద్యార్థులు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం ప్రధాన మంత్రి టి.బి ముక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, శాంతిహేమ్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2035వ సంవత్సరం నాటికి దేశంలో ట్యూబర్ క్లోసిస్(టి.బి) వ్యాధిని పూర్తిస్థాయిలో ప్రారదోలటమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ సంకల్పం చేయాలని కోరారు. గాలి ద్వారా వ్యాపించే ఈ క్రిమిని నివారించాలంటే ప్రజలు మాస్క్ ధరించటం, దగ్గుతున్నప్పుడు దూరం వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, డా.పూజా భరధ్వాజ్, డా.జి.రవికుమార్, పి.అన్నాజీరావు, త్రినాధరావు, ఢిల్లేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజల్ని ఆకట్టుకుంటున్న మట్టి విగ్రహాల తయారీ

విశాలాంధ్ర - జలుమూరు : హిందూ సాంప్రదాయ ప్రకారం జరుగుతున్న అనేక పండగల ఉత్సవాలకు జలుమూరు మండలం నగరికటకం గ్రామంలో రాజన్న రవికుమార్ తయారు చేసే మట్టి విగ్రహాలు ఎంతో అద్భుతంగా ప్రజలని ఆకట్టుకుంటున్నాయి. కొన్ని సంవత్సరాలుగా పర్వదినాల కోసం ముందుగా ఈ విగ్రహాలను తయారు చేస్తూ గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తామని మరి కొందరు ముందుగా అడ్వాన్స్ ఇచ్చి బుక్ చేస్తారని ఆయన తెలిపారు. మరి వినాయక చవితి పర్వదిన సందర్భంగా మూడు అడుగుల నుండి 8 అడుగుల ఎత్తు గల విగ్రహాలు తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత తరుణంలో రంగుల ధరలు పెరుగుదల వలన అధిక ధరకు అమ్మకం చేపడితే వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని తక్కువ రేటుకి అమ్మితే నష్టం కలుగుతుందని రవికుమార్ తెలిపారు. వీటితోపాటు దుర్గాదేవి, సూర్యనారాయణ స్వామి, అనేక విగ్రహాలు తయారు చేస్తున్నట్లు నరసన్నపేట పాతపట్నం టెక్కలి నియోజకవర్గాల నుండి వచ్చి కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు.

భూ వివాదాలు పరిష్కారానికి రీ సర్వే : తహశీల్దార్

విశాలాంధ్ర - కవిటి : భూ వివాదాలు పరిష్కారానికి రీ సర్వే ఎంతగానో దోహదపడుతుందని తహసిల్దార్ మురళీమోహన రావు బెహరా అన్నారు.ఈ మేరకు శుక్రవారం జగతి, బెజ్జిపుట్టుగ గ్రామాలలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే అంటే భూమి సరిహద్దులను, హక్కులను తిరిగి నిర్ధారించడానికి చేసే ప్రక్రియని దీని ద్వారా భూమి రికార్డులను సరిచేసి, భూమి యజమానులకు హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రీసర్వేలో భాగంగా, ప్రతి భూమి యొక్క ప్రస్తుత సరిహద్దులను గుర్తించి,భూమి రికార్డులను సిద్ధం చేస్తామని అన్నారు. దీనివల్ల భూమికి సంబంధించిన వివాదాలు పరిష్కారమయి,భూమి యాజమాన్య హక్కులు స్పష్టంగా తెలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పొందల కృష్ణారావు, డిప్యూటీ తహసిల్దార్ ఎం కృష్ణమూర్తి, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ పి. నిరంజన్, మండల సర్వేయర్ డి.కృష్ణారావు, వీఆర్వోలు బీరేంద్ర, వజ్జ గిరిబాబు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు చెల్లించిన మొత్తానికి రసీదు అందించండి : ఎమ్మెల్యే కూన రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో రైతులు తీసుకున్న అప్పుని తిరిగి చెల్లించిన తర్వాత వారికి రసీదు ఎందుకు ఇవ్వటం లేదని ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నియోజకవర్గంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రైతులకు తెలియకుండా వారి అప్పును పెంచేస్తూ ఆ మొత్తానికి నోటీసులు ఇచ్చి అధిక మొత్తలు వసూలు చేస్తున్నారని రైతు చెల్లించిన మొత్తానికి వెనువెంటనే రిసిప్ట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. రైతులు చెల్లించిన మొత్తాన్ని కొన్ని రోజులు వారి వద్ద ఉంచి కొంత మొత్తం అయిన తరువాత డ్రాయర్ మొత్తం బ్యాంకులో జమ చేస్తామని ఆ తరువాతే రిసిప్ట్ అందించగలమని సరు బుజ్జిలి సీఈవో చెప్పిన సమాధానానికి ఎమ్మెల్యే ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఆయన చెల్లించిన మొత్తానికి రసీదు ఎందుకు ఇవ్వరు అని రైతు సొమ్ము తినే దొంగలుగా తయారవుతున్నారని అన్నారు. సొసైటీలో రైతులు చెల్లించిన మొత్తం వారు తీసుకున్న అప్పు అన్నింటి పైన డిపార్ట్మెంట్ ఆడిట్ తో పాటు ప్రత్యేక ఆడిట్ బృందం ఉంటుందని పొందూరు సీఈవో తెలిపారు. ఆడిట్ విధానంలో తప్పులు ఉన్నాయని అంతేకాకుండా దొంగ ఆడిట్ రిపోర్టులు రైతులకు తెలుసని అన్నారు. చేసే విధానాలు పై రైతులు కేసు పెడితే ఏమవుతుందో తెలుసా అని అన్నారు. ప్రతి ఒక్కరూ పనిచేయాలని పనిచేసేందుకు ఇష్టం లేకుంటే సెలవు పెట్టి వెళ్లిపోవాలని మరో అధికారిని నియ మించుకుంటామని తెలిపారు. పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి ఇటీవల కార్యాలయానికి వెళ్ళినప్పుడు ఎవరు ఉండటం లేదని ఎమ్మెల్యే వివరించారు. పాలక వర్గమే సంస్థకు సుప్రీమ్ అని వారి అనుమతితోనే కార్యకలాపాలు జరగాలని స్పష్టం చేశారు. కార్యాలయంలో పనిచేసేవారు ఏ కారణాలవల్ల బయటకు వెళుతున్నారు స్పష్టం చేయాలని ఆదేశించారు. కొంతమంది అధికారుల పనితీరు బాగోలేదని వారి తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పు అన్నారు. డిసిసి బి అధ్యక్షులు శివాల సూర్యనారాయణ, డైరెక్టర్ పైడి మురళీధర్ రావు బుజ్జి పొందూరు సరుబుజ్జిలి ఆమదాలవలస వ్యవసాయ పరపతి సంఘం సిబ్బంది ఉన్నారు.